ఏడు నెలల పసికందు విక్రయం

- పలువురుపై కేసు నమోదు

నవతెలంగాణ-ఆర్మూర్

ఏడు నెలల పసికందును విక్రయించిన ఘటన ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఆలస్యంగా వెలుగుజూసింది. ఈ ఘటనలో పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ దంపతులకు పిల్లలు లేకపోవడంతో, నందిపేట్‌కు చెందిన ఓ జంట తమ 7 నెలల బాలుడిని అమ్మినట్లు దర్యాప్తులో తెలిసిందని తెలిపారు. సమాచారం రావడంతో పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ లక్ష్మణ్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏడు నెలల బాలుడిని జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో ఉన్న ఐసిడిఎస్ బాలల కేంద్రంలో అధికారుల సంరక్షణలో ఉంచినట్లు చెప్పారు. 7 నెలలో చిన్నారి పసికందు అమ్మిన ఘటనపై పలువురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇలాంటి చట్టవిరుద్ధమైన కార్యక్రమాలు చేయడం నేరమని, ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని సదరు వ్యక్తుల పట్ల చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

1

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

సోమవారం | అక్టోబర్ 07, 2024 | www.navatelangana.com

వరి కోతలు షురూ



నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఖరీఫ్ సీజన్లో ముందస్తుగా వరి నాట్లు వేసిన రైతులు వరి పంటలు కోతకు రావడంతో పంటను వరికోత మిషన్లతో కోయిస్తున్నారు. కోత పూర్తికాగానే వెంటనే ధాన్యాన్ని సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని భవానిపేట్, మంబోజిపేట్, జల్దిపల్లి, శెట్టిపల్లి సంగారెడ్డి, పోల్కంపేట్, ముస్తాపూర్, లింగంపల్లి, బాణాపూర్ గ్రామాల్లో ముందస్తుగా వరి నాట్లు వేసిన రైతుల పంట పొలాలు వరి కోతకు రావడంతో కోతలు ప్రారంభమయ్యాయి.

పంట చేతికొస్తున్నా..
భరోసా ఇవ్వట్లే



పలు చోట్ల కొనసాగుతున్న కోతలు

- సీజన్ ముగస్తున్నా ఇంకా అందని రైతు భరోసా
- కనీసం కోతలకన్నా ఉపయోగపడతాయని రైతుల ఎదురుచూపులు

నవతెలంగాణ-గాంధారి

రైతుభరోసా.. సీజన్ ప్రారంభంలో పంటసాగు చేసేందుకు రైతులకు పెట్టుబడి సాయంగా అందించాల్సిన పథకం. కానీ సీజన్ ప్రారంభమై ముగింపు దశకు వచ్చినా రైతుభరోసాపై ఉలుకు పలుకు లేదు. పంటలు చేతికి వస్తున్నా.. ఇప్పటికీ ప్రభుత్వం ఒక స్పష్టత ఇవ్వడం లేదు. కనీసం పంట కోతల సమయంలోనైనా డబ్బులు వస్తే ఆసరా అవుతుందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో రైతులకు ఎకరాకు ఒక సీజన్‌కు ఐదు వేల చొప్పున పెట్టుబడిసాయంగా అందజేసింది. అయితే ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15000 రైతుభరోసా అమలు చేస్తామని ప్రకటించిన విషయం విధితమే. అధికారంలోకి వచ్చిన మొదట్లో ఒక దఫా రబీ సీజన్‌కు రైతుభరోసా కింద గత ప్రభుత్వం అందజేసినట్టుగా ఎకరాకు రూ.5000 సాయం అందజేసింది. అయితే వర్షాకాలం సీజన్ డబ్బులు ఇప్పటికీ రైతులకు అందజేయలేదు.

గాంధారి మండలం వ్యాప్తంగా 52,500 ఎకరాల భూమి ఉంది. అందులో సాగు భూమి 40 వేల ఎకరాలు. అయితే గతంలో మండలంలో సుమారు 20 వేల మంది రైతులకు రూ.22.57 కోట్ల రైతుబంధు నిధులు వారి ఖాతాల్లో జమ అయ్యేవి. జిల్లా వ్యాప్తంగా 2.92 లక్షల మంది రైతులకు గాను సుమారు రూ.254 కోట్ల నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అయ్యేవి. దీంతో పంట పెట్టుబడి కింద రైతులకు పంటసాగుకు ఉపయోగపడేవి.

చేతికొస్తున్న పంటలు

అయితే వర్షాకాలం సీజన్ మరో 15 రోజులలో ముగుస్తుండడంతో ప్రభుత్వం ఇప్పటికీ రైతు భరోసా డబ్బులు వేయలేదు. ఇక వర్షాకాలం రైతు భరోసా డబ్బులు అంతే సంగతని రైతులు భావిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 సంవత్సరంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభించిన పథకం ప్రతి రబీ ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభంలో ఎకరా ఐదువేల రూపాయలు రైతు పెట్టుబడి కోసం ప్రభుత్వం రైతు ఖాతాలో వేసేది. 2023 సంవత్సరం అసెంబ్లీ ఎన్నికల కారణంగా డబ్బులు పడలేదు. ఎన్నికల కమిషన్ అనుమతితో అసెంబ్లీ ఎన్నికలకు రెండు రోజుల ముందు డబ్బులు పడ్డాయి. జూన్ మాసంలో పడవలసిన రైతు భరోసా డబ్బులు ఇప్పటివరకు పడకపోవడంతో రైతు భరోసా డబ్బులు పడతాయో లేదో అని రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. రైతు భరోసా పథకం ఉన్నట్టా ఊడినట్టా అని రైతులు చర్చించుకుంటున్నారు.

మళ్లీ వడ్డీ వ్యాపారుల ఆశ్రయం

రైతుభరోసా డబ్బులు పడకపోవడంతో పలువురు రైతులు మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. డబ్బులు వచ్చాక కట్టొచ్చు అన్న భరోసాతో అధిక వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పంటలు చేతికి వస్తున్న తరుణంలో ఇప్పుడైనా డబ్బులు వస్తే కోత యంత్రాలకు, ఇతర కూలీలకు, ఖర్చులకు ఉపయోగపడే అవకాశం ఉందని, లేకుంటే మళ్లీ వ్యాపారులను ఆశ్రయించక తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

మళ్లీ అప్పులు తెస్తున్నా



సుద్దాల నర్సింలు.. నేరల్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు డబ్బులు వేస్తదని ఆశతో ఉంటున్నాం. వర్షాకాలం పంట వేసే సమయంలో డబ్బులు వస్తాయని అనుకున్నాం. రాకపోయేసరికి షావుకారి దగ్గరికి వెళ్లి అప్పు తెచ్చుకున్నా. ఇప్పుడన్నా ఇస్తే ఉపయోగం.

సకాలంలో వేయాలి



పుప్పాలని నడిపి సాయిలు

చిన్న పోతంగల్

రైతుబంధు డబ్బులు సరైన సమయంలో వేయాలి. మళ్ళీ బాకీలు చేసే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రబీకైనా సరైన సమయంలో రైతు భరోసా డబ్బులు వేయాలి.

గ్రంథాలయసంస్థలకు చైర్మన్‌ల నియామకం

- నిజామాబాద్ జిల్లాకు అధ్యక్షులుగా అంతిరెడ్డి రాజిరెడ్డి
- కామారెడ్డి జిల్లాకు మద్ది చంద్రకాంత్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి



అంతిరెడ్డి రాజిరెడ్డి



మద్ది చంద్రకాంత్‌రెడ్డి

గ్రంథాలయ సంస్థలకు చైర్మన్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అంతిరెడ్డి రాజిరెడ్డిని నియమించగా, కామారెడ్డి జిల్లాకు మద్ది చంద్రకాంత్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరు ఇరువురూ మొదటి నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న వారే. రాజిరెడ్డి డీఎస్‌కు, సుదర్శన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందగా, చంద్రకాంత్‌రెడ్డి షబ్బీర్‌అలీకి నమ్మినబంటుగా ఉన్నారు. నిజామాబాద్ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(నుడా) పదవిని అంతిరెడ్డి ఆశించినప్పటికీ ముందు నుంచి వస్తున్న ఊహాగానాల ప్రకారమే గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి దక్కింది.

'చిగురి'ంచిన ఆశ

నవతెలంగాణ-బోధన్

మనిషి తన జీవన గమనంలో ఎన్నో ఒడిదుడుకులు అనుభవిస్తుంటాడు. అయితే అందులో కొందరు వాటిని తట్టుకోలేక జీవితంపై విరక్తితో ఆత్మహత్యే శరణ్యంగా భావించి బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు ఎన్నో వెలుగు చూస్తున్నాయి. కానీ ఓటమి నుంచి విజయం సాధించవచ్చని కొందరే గుర్తిస్తారు. దానికి నిదర్శనమే ఈ చిగురించిన చెట్టు. సాలూర క్యాంప్ గ్రామంలో రోడ్డు పక్కన విద్యుత్ వైర్లకు చెట్టు ఆటంకిగా మారిందని భావించి చెట్లను నరికేశారు. ఆ నరికేసిన చెట్టుకు మళ్లీ ఆకులు చిగురించాయి. అంటే జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఎప్పటికైన చిగురించిన కొమ్మ వలే విజయం సాధించవచ్చని ఆ చెట్టు సందేశం ఇస్తున్నట్లు ఉంది.



సగం వరకు నరికేసిన చిగురిస్తున్న చెట్టు

'డీజే' పంచాయితీ

- పర్మిషన్ ఇవ్వాలని సీపీకి వెల్లువెత్తుతున్న వినతులు
- తాజాగా పీసీసీ చీఫ్ సూచనతో సీపీని కలిసిన మానాల
- ప్రజలకు, సీనియర్ సిటిజన్స్, పిల్లలకు ఇబ్బందులు కలగకుండా రెండు బాక్సులు వినియోగించొచ్చు : సీపీ



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న మానాల మోహన్‌రెడ్డి, డీజే నిర్వాహకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లాలో డీజే పంచాయితీ నడుస్తోంది. డీజేపై నిషేదం విధించడంతో తమ ఉపాధి కోల్పోతు న్నామని, కుటుం బాలు రోడ్డున పడుతున్నా యని కొన్ని షరతులు ఇచ్చి అనుమ తించాలని నిర్వాహకులు సీపీని కలిసి విన్నవించు కున్నారు. అదే విధంగా పీసీసీ చీఫ్‌ను కలవగా.. ఆయన సీపీతో ఫోన్‌లో మాట్లాడి ఆదివారం మానాల మోహన్‌రెడ్డిని సీపీ కార్యాలయానికి పంపారు. బతుకమ్మ, దసరా పండుగ రోజున ప్రజల సంతోషం మేరకు అదేవిధంగా డిజే యాజమానుల జీవన ఆధారం డీజేలు నడపడం కావున వారి అవసరం కోసం షరతులతో తక్కువ సౌండ్‌తో దసరా, బతుకమ్మ పండుగలకు డీజే కు అనుమతి ఇవ్వాలని మానాల వినతిపత్రం అందజేశారు. అదే విధంగా దసరా బతుకమ్మ పండుగలు అయిపోయే వరకు హెూటల్, వ్యాపారస్తులకు సమయం పెంచాలని కోరారు.

కాగా ప్రజలకు, సీనియర్ సిటిజన్స్, పిల్లలకు ఇబ్బందులు కలిగేలా పెట్టే డీజేలకు అనుమతి లేదని, చట్ట పరిధిలో రెండు బాక్సులను ఉపయోగించి కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సీపీ కల్మేశ్వర్ మరోసారి స్పష్టం చేశారు. అదే విధంగా డీజే నిర్వాహకులు ఈ నెల 30వ తేదీ వరకు లైసెన్స్, పర్మషన్‌లు తీసుకోవాలని చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి డీజేలు తీసుకురావడం పూర్తిగా నిషేధమని, అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

చెరువుల్లోకి 2.27 కోట్ల చేప పిల్లలు

- నేటి నుంచి విడుదల చేసేందుకు ప్రణాళికలు
- ఎక్కడైనా అవకతవకలు జరిగితే ఫిర్యాదు చేయాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- చేప పిల్లల నాణ్యతను పరిశీలించాలని మత్స్యకార సంఘాలకు హితవు



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మత్స్యకార కుటుంబాలకు చేయూతను అందించేందుకు గాను వంద శాతం సబ్సిడీపై జిల్లాలోని ఆయా చెరువులలో ఈ నెల 7వ తేదీ (సోమవారం) నుండి చేప పిల్లలను విడుదల చేయనున్నట్టు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదివారం తెలిపారు. జిల్లాలోని 396 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లోని సుమారు 24 వేల మంది మత్స్యకారులకు లబ్ది చేకూరేలా ప్రస్తుత 2024-2025 ఆర్థిక సంవత్సరానికి గాను 2.27 కోట్ల చేప పిల్లలు చెరువులలో వదలడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. వీటిలో 35 నుంచి 40 ఎం.ఎం సైజు గల చేప పిల్లలు 135 లక్షలు, 80 నుంచి 100 ఎంఎం సైజు గల 91 లక్షల చేప పిల్లలను మత్స్య అభివృద్ధి పథకం కింద విడుదల చేసేలా చర్యలు తీసుకున్నామని అన్నారు.

చెరువులలో చేప పిల్లలు వదిలే సమయంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల సభ్యులు వాటి నాణ్యతను సక్రమంగా చూసుకోవాలని, ఆయా చెరువులకు మంజూరు చేయబడిన మేరకు పూర్తి స్థాయిలో చేప పిల్లలు వదులుతున్నారా లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. చేప పిల్లల సైజుని స్కేలుపై కొలిచి నిర్ధారించుకోవాలని, చేప పిల్లలు చలాకీగా ఉన్నాయో లేదో గమనించాలని, చేప పిల్లలను వదిలే సమయంలో ఆయా సంఘాల సభ్యులు తప్పనిసరిగా ఉండి అన్ని అంశాలను జాగ్రత్తగా చూసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు.

చేప పిల్లల సైజులో కానీ వాటి రకాలలో, నిష్పత్తిలో ఏవైనా తేడాలు ఉన్నట్లయితే, వెంటనే జిల్లా మత్స్యశాఖ అధికారులకు లేదా కలెక్టర్ కార్యాలయానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్

నవతెలంగాణ-సదాశివనగర్

ఎన్నికల సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండ్ చేశారు. సదాశివనగర్ మండలం మర్కల్‌లో ఆదివారం పార్టీ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా 6 గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదని తెలిపారు. అర్హులం దరికీ రైతు రుణమాఫీ వర్తింపజేయాలని, రైతుభరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో మండల నాయకులు మోహన్, శాఖ కార్యదర్శి స్వామి, రాజు, నర్సింలు మల్లేష్, రాజయ్య పాల్గొన్నారు.



శాఖ సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌గౌడ్

బహిష్కరించిన కులపెద్దలపై చర్యలు తీసుకోవాలి

- ఎక్సైజ్ అధికారులకు 12 గౌడ కుటుంబాల ఫిర్యాదు

నవతెలంగాణ-వర్ని



ఫిర్యాదు చేస్తున్న బాధిత గౌడ కులస్తులు

నిజామా బాద్ జిల్లా మోస్రా మండల కేంద్రానికి చెందిన 12 గౌడ్ కులస్తులను కుల పెద్దలు కుల బహిష్కరణ చేశారని, కల్లు అమ్ముకోనియకుండా అడ్డుకుంటు న్నారని బాధితులు వాపోయారు. ఆదివారం బోధన్‌లో ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కుల పెద్దలు గొల్లపల్లి శంకర్ గౌడ్, ఆర్. శేఖర్ గౌడ్, భద్ర సాయగౌడ్, బొజ్జ శ్రీహరి గౌడ్, బొజ్జ శ్రీనివాస్ గౌడ్ ఐదుగురు కుల పెద్దలు తమ కుటుంబాలపై బహిష్కరణ చేశారని, తమ మాటకు లోబడి ఉండాలని ఆంక్షలు విధిస్తున్నారని వాపోయారు. ఎవరిది వారు కల్లు అమ్ముకుంటామని చెబితే కేసులు పెట్టిస్తామని బెదిరింపులు చేస్తూ దుర్భాషలాడుతూ తమ పై దాడులు చేశారని వాపోయారు. బిపి, షుగర్ ఉన్న పెద్ద మనుషులను కూడా చూడకుండా పిడుగుద్దులు గుద్దారని ఆరోపించారు. తాత ముత్తాతల నుంచి ఇక్కడే ఉన్న తమను భయబ్రాంతులకు గురి చేస్తున్నారని, బతుకు దెరువు కోసం వలస పోతే పోవద్దు అని హుకుం చేస్తున్నారని తెలిపారు. కుల పెద్దలుగా చెలామణి అవుతున్న వారు తమ పై చేస్తున్న కుల బహిష్కరణ, దాడులకు దిగిన వారిపై పోలీస్, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కుటుంబానికి భారమవుతున్నానని ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోరా గ్రామానికి చెందిన మని గుండ్ల సాయిలు (40) అనే వ్యక్తి పక్షవాతంతో అనారోగ్యంతో ఉండటంతో.. కుటుంబ సభ్యులకు భారమవుతున్నానని మనస్థాపం చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు తెలిపారు.

బతుకమ్మకు పుట్టెడుపూలు

- మార్కెట్‌లో విరివిగా విక్రయాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ





పూలు విక్రయిస్తున్న పలువురు

బతకమ్మ అంటేనే ప్రకృతి పండుగ. ప్రకృతిలో లభించి పూలను పేర్చి ఒక రూపం ఇచ్చి ఆడబిడ్డలు కొలుస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో బతుకమ్మను పేర్చేందుకు పోటాపోటీగా పూల సేకరణకు వెళ్తుంటారు. కాగా పట్టణ ప్రాంతాల్లో పూలు లభించకపోవడంతో కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం నగరం చుట్టుపక్కల పువ్వుల విక్రయాలు విరివిగా సాగుతున్నాయి. తంగేడు, గునక పువ్వుతో పాటు బంతిపూల విక్రయాలు జోరందుకుంటున్నాయి. నగరంలోని గాంధీచౌక్, పెద్దబజార్, ఆర్ఆర్‌చౌరస్తా, రైల్వేస్టేషన్ చౌరస్తా, హమాల్‌వాడీ బ్రిడ్జి, వీక్లిమార్కెట్, కంఠేశ్వర్ వద్ద చుట్టుపక్కల గ్రామాల నుంచి పువ్వులను తీసుకొచ్చి విక్రయాలు చేపడుతున్నారు. తంగేడు పువ్వులను కట్టలుగా కట్టి 20 రూపాయల చొప్పున విక్రయిస్తున్నారు.

అంతేకాకుండా మరోవైపు దేవి మాత విగ్రహాలకు పూలు కొనుగోలు చేస్తున్నారు. బంతి పూలు కిలో 40 రూపాయల చొప్పున, తెల్ల , పచ్చ చామంతి పూలు కిలో 160 రూపాయల చొప్పున, గులాబీలు కిలో 160 చొప్పున విక్రయాలు కొనసాగుతున్నాయి.



హమాల్‌వాడి బ్రిడ్జిపై గునుగు, తంగేడు పూలు విక్రయిస్తున్న మహిళలు

ముందుస్తు హద్దులు

- ధాన్యం ఆరబోతకు రైతన్న కష్టాలు
- రోడ్లమీద ధాన్యంతో వాహనదారులకు ఇక్కట్లు



రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్న



ముందస్తు హద్దులు ఏర్పాటు చేసుకున్న పలువురు రైతులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఆరుగాలం కష్టించి పంట పండించే రైతన్నకు కల్లాలు లేక అవస్థలు పడుతున్నాడు. చేతికొచ్చిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రోడ్లను ఆశ్రయిస్తున్నాడు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో ఇప్పటికే వరి ధాన్యం కోతలు ప్రారంభమయ్యాయి. వాతావరణంలో మార్పుల కారణంగా కొందరు రైతులు వాయిదా వేయగా, మరి కొందరు ధాన్యం ఆరబెట్టుకునేందుకు ముందస్తుగా రోడ్లను హద్దులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఒకరి హద్దులు మరొకరు రాకుండా ఉండేందుకు గుర్తులు పెట్టి వంతులు వారిగా కాపలా కాస్తున్నారు.

బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామం నుండి ఇబ్రహీంపట్ వెళ్లే మధ్యలో ధాన్యం కోసం రోడ్డుపై హద్దులను ఏర్పాటు చేసుకుంటున్నారు. బాన్సువాడ డివిజన్ లో పంట నూర్పిడి తర్వాత ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో వ్యవసాయ పొలాల్లోనే రైతులు కల్లాలను ఏర్పాటు చేసుకొని పంట నూర్పిళ్లు చేసి ఆరబెట్టేవారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు రావడంతో రైతులు వరికోత యంత్రాలతో కోతలు కోస్తున్నారు. దీంతో ధాన్యంలో చెత్తాచెదారం తొలగిపోయి శుభ్రం అవుతుండడంతో కల్లాలను తయారు చేసుకోవడంలేదు. నేరుగా రోడ్లపైకి ధాన్యాన్ని తీసుకొచ్చి ఆరబెడుతున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. రోడ్లపై వ్యవసాయ ఉత్పత్తులను ఆరబెట్టడం మూలంగా రైతులతో పాటు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లపై సగభాగం వరకు ధాన్యం ఇతర ఉత్పత్తులను ఆరబెట్టడంవల్ల రాత్రి వేల ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. ధాన్యం కుప్పలకు అడ్డుగా పెట్టే రాళ్లను గమనించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే ధాన్యం ఆరబోసే క్రమంలో రైతులకు ప్రమాదం తప్పని పరిస్థితి నెలకొన్నది. నసురుల్లాబాద్ మండలంలోను, బీర్కూర్ మండలంలో ఉన్న రహదారిపై గత సంవత్సరం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

దుర్కి నుంచి ఇబ్రహీంపేట్ వరకు, బాన్సువాడ నుంచి నిజాంసాగర్ వరకు బాన్సువాడ నుంచి బీర్కూర్ గ్రామాల మధ్యనున్న రహదారిపై ప్రమాద భరితంగా ధాన్యాన్ని ఆరబెట్టుతారు. ఆరుగాలం కష్టించి పంట పండించే రైతన్నకు కల్లాలు లేక రోడ్లపై ధాన్యం ఆరబెట్టిన రైతులను ఆదుకుంటూ,చిన్న చిన్న తరచూ జరుగు ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

బాధిత కుటుంబాలకు సునీల్ కుమార్ పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునిల్‌కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలం కేంద్రంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ కుమార్ ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన ఈనాడు సురేష్ వాళ్ల నాన్న పోషన్న మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి పగాఢ సానుభూతిని తెలిపారు. రామన్నపేట్ గ్రామానికి చెందిన బ్యాంక్ రాజు వాళ్ళ అమ్మ బల్లాయి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన చెందిన రత్నం వాళ్ళ అత్తమ్మ చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు పుప్పాలపల్లి క్రీడాకారిణి


జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్‌కు ఎంపికైన సన్నిత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

జాతీయ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు పుప్పాలపల్లి క్రీడాకారిణి దేశెట్టి సన్నిత ఎంపికయ్యారు. గత నెల 21 నుండి 23 వరకు వేములవాడ రాజన్న జిల్లాలోని సిరిసిల్ల పట్టణంలో జరిగిన రాష్ట్ర జూనియర్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్స్ పోటీల్లో మండలంలోని పుప్పాల పల్లి గ్రామానికి చెందిన క్రీడాకారిణి దేశెట్టి సన్నిత పాల్గొన్నారు. చక్కని ప్రతిభ కనబరిచి ఈనెల 6 నుండి 10 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాలలో జరుగుతున్న 42వ జాతీయస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించి అంతర్జాతీయ స్థాయిలో సైతం రాణించాలని ఆకాంక్షించారు.

గుంతలమయంగా కంఠేశ్వర్ రోడ్లు

- నిర్మాణానికి నోచుకోని కంఠేశ్వర్ ప్రాంతం
- చిన్నపాటి వర్షానికి జలమయం
- పట్టించుకునే నాథుడే కరువు
- 30 ఏండ్లుగా ఇదే పరిస్థితి


కంఠేశ్వర్ ఆలయం ఎదురుగా మేన్‌రోడ్డు


గుంతల మయంగా మారిన సీసీ రోడ్డు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరాన్ని సుందరంగా మారుస్తామన్న నేతల మాటలు కేవలం నీటి మూటలుగా మిగిలాయి. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలోని రెండు, మూడు కాలనీల్లో రోడ్ల పరిస్థితి మరి దారుణంగా తయారైంది. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని కంఠేశ్వర్ ప్రాంత ప్రజలు ఆవేధ వ్యక్తం చేస్తున్నారు. 30 సంవత్సరాలుగా కంఠేశ్వర్ ప్రాంతంలో రోడ్లను పట్టించుకునేవారు లేకుండా పోయారు.


కాలనీలో సగం వేసి వదిలేసిన సీసీ రోడ్డు

నగరంలోని కంటేశ్వర్ స్మశాన వాటికకు వెళ్లే దారిలో రోడ్లు కొన్ని ఏళ్ల తరబడి సుమారు 30 ఏళ్లుగా అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతాన్ని పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. పార్టీ నాయకులు, అధికారులు వచ్చి చూసి వెళ్లడమే తప్ప ఎలాంటి మార్పు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు 10 ఏళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం వరకు ఈ రోడ్ల పరిస్థితి మారలేదు. గతంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కంఠేశ్వర్ స్మశాన వాటికకు వెళ్లే రోడ్డు అతుకుల బొంతగా మార్చాడు. రోడ్డును రెండు భాగాలుగా చేసి సగం సగం వేసి వదిలేశారు. నాణ్యత లేకుండా సిసి రోడ్డు వేయడంతో ఆరు నెలలకే రోడ్డు పరిస్థితి యధావిధిగా గుంతల మయంగా కంకర తేలింది. ముఖ్యంగా వర్షాకాలంలో వర్షాలు పడితే వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ముఖ్యంగా కంఠేశ్వర్‌లోని మెన్‌రోడ్డు నుంచి స్మశాన వాటికకు వెళ్లే రోడ్డు అభివద్ధికి నోచుకోలేదు. బిటి, సిసి రోడ్డును వేసిన దాఖలు లేవు. ఈ కాలని రోడ్ల గురించి స్థానిక కార్పొరేటర్, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కమిషనర్, ఎమ్మెల్యే స్మశాన వాటికను పరిశీలించడానికి రావడంతో కాలనీవాసులు రోడ్ల పరిస్థితి గురించి వారి దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్, ఎమ్మెల్యే దృష్టి పెట్టి కాలనీ రోడ్లను భాగుచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల సమయంలో మాత్రమే మేము గుర్తుకు వస్తాం..



స్థానికులు శారద

కంఠేశ్వర్ ప్రాంతం అంటే అధికారులకు పట్టనే పట్టదు. ఎన్నికల సమయంలో మాత్రమే పాలకులకు మా కాలనీ గుర్తుకువస్తుంది. ఐదు సంవత్సరాలకు మాత్రమే ఒక రెండు మూడుసార్లు వస్తారు. మళ్లీ ఐదేళ్ల వరకు ఎవరూ రారు. మా ప్రాంత ప్రజలంటే అందరికీ అలుసు. తమ ప్రాంతంలో ఉన్నటువంటి సమస్యలను అధికారులు పాలకులు స్వయంగా సందర్శించి మొదట రోడ్లు తప్పనిసరిగా బాగుండేలా చూడాలి. కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నాం.


బీసీల కులగణన వెంటనే చేపట్టాలి


సభలో అభివాదం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

బీసీల కుల గణన తక్షణమే చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, వ్యవస్థాపకులు మేకపోతుల నరేందర్ గౌడ్ అన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండలకేంద్రంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ 42శాతం బీసీలకు స్థానిక సంస్థ ఎన్నికల్లో రిజర్వేషన్లు ప్రకటిస్తామని మౌనంగా ఉండడంపై బీసీలు అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. కులగణన చేపట్టాలని హైకోర్టు తీర్పు ఇచ్చిన కూడా నిమ్మకు నీరెత్తినట్టుగా రాష్ట్ర ప్రభుత్వాన్ని వ్యవహరిస్తోందన్నారు. బహిరంగ సభ విజయవంతమైందని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు అబ్బగోని అశోక్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోతే రామ గౌడ్, టిడిపి పాంప్లమెంట్ అధ్యక్షులు దేగం యాదగౌడ్, రాష్ట్ర కార్యదర్శి దాసరి మూర్తి, జగడం వెంకన్న, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు అన్న గౌడ్ నారా గౌడ్, నిజామాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాసశ్యాం, బాల్కొండ నియోజకవర్గ ఉపాధ్యక్షులు బండిమల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ మోకులపై గీత కార్మికులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న గీతా కార్మికులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కెట్‌లో గీత కార్మికులకు సేఫ్టీ మోకుల ఉపయోగం శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్ రాములు మాట్లాడుతూ.. ఇప్పటికే జిల్లాలో మూడు కేంద్రాల్లో శిక్షణ ఇవ్వడం జరిగిందని, రూరల్ నియోజకవర్గంలో ఉన్న గీత కార్మికులకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి, బిసి కార్పొరేషన్ ఈడీ రమేష్ కాటమయ్య రక్షణ కవచం కిట్లను 52 మందికి పంపిణీ చేశారని తెలిపారు. ఇంకా చాలామంది అర్హత ఉన్నవాళ్లు శిక్షణ తీసుకోలేకపోయారని, వారికి మరో దఫా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. గీత వృత్తిదారులు సొసైటీ సభ్యులు కాని వారు కూడా ఉన్నారని, వారికి కూడా సభ్యత్వాన్ని ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గీత వృత్తిదారులకు వృత్తిదారుల పెన్షన్ అమలు చేయాలని, గీత కార్మికులందరికీ మోపెడ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలుగీత కార్మికులకు ఎదుర్కొంటున్న సమస్యలు అన్ని పరిష్కరిస్తామని, ఎవరికైనా అందకపోతే వాటిని కూడా అందిస్తామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఈడీ రమేష్, ఎక్సైజ్ అధికారులు, నరసయ్య, గంగాధర్, శిక్షకులు బుచ్చా గౌడ్ ,అనిల్ గౌడ్, జితేందర్ గౌడ్, సాదయ్య గౌడ్, 25 మంది కల్లుగీత కార్మికులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సునిల్‌కుమార్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని జాగిర్యాల్ గ్రామానికి చెందిన గాండ్ల శ్రీకాంత్ వాళ్ల నానమ్మ, పెద్ద నాన్న. గాండ్ల గంగు, గాండ్ల రాజన్న ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ ఆదివారం పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. సుదర్శన్ నగర్ తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు బుక్యా సురేష్ వాళ్ళ నాన్న సీతారాం నాయక్ ఇటీవల మరణించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. రహత్‌నగర్ గ్రామానికి చెందిన బోండ్ల సుదర్శన్ చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. పేద కుటుంబం కావడంతో వారి కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సాహాయం అందించారు. అదే గ్రామానికి చెందిన గంగాధర్ హార్ట్ ఎటాక్‌తో చనిపోవడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవి మండపాలవద్ద అన్నదానాలు

నవతెలంగాణ-ఆర్మూర్

దేవి నవరాత్రుల సందర్భంగా పట్టణంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పి ప్రి గ్రామంలో శ్రీ మహాలక్ష్మి మాత మండలికి ఆర్ .ఆర్ .ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి చీరలను అందజేసినట్టు విశ్వబ్రాహ్మణ సంఘ గ్రామ ప్రతినిధి సుంకం భూషణ్ తెలిపారు. ప్రతినెల పాఠశాలలో నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నట్టు, భజన మండలి భక్తులకు దుస్తులు అందజేస్తూ, గత వినాయక చవితి ఉత్సవాలలో సైతం సుంకం భూషణ్ సేవలు చేయడం అభినందనీయమని గ్రామ అభి----వృద్ధి కమిటీ సభ్యులు గుండ చిన్నారెడ్డి, నవీన్, నరసయ్య రాజేశ్వర్ తెలిపారు. ఆలూరు మండల కేంద్రంలో 11 స్టార్, పట్టణంలోని మహాలక్ష్మి కాలనీ పవర్ యూత్ దుర్గామాత వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో యజ్ఞం నిర్వహించగా, మామిడిపల్లి హిందూ సేన యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మేడిదాల సంగీత రవి గౌడ్, యూత్ సభ్యులు సందీప్ గుప్తా, పడకంటి చంద్రబోస్, వెంగబాబు, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

- తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం
- ఓబన్నకు ఘన నివాళ్లు


మాట్లాడుతున్న వడ్డెర వృత్తిదారుల సంఘం సభ్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవాడలో గల తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం కార్యాలయంలో ఓబన్న 179 వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా తెలంగాణ వడ్డెర వృత్తుదారుల సంఘం రాష్ట్ర జిల్లా అధ్యక్షులు విడగొట్టి సాయిలు మాట్లాడారు. వడ్డె ఓబన్న బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా రేనాడి ప్రాంతంలో ఒక్క నిప్పురవ్వలా మహా ఉద్యమానికి కీలక పాత్ర పోషించాడని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో గిద్దలూరు దగ్గర బ్రిటిష్ సైన్యం నల్లమల్ల ఎర్ర మాలకొండల మబ్బు పేరుకుపోయిన కొండల్లో నాథ స్వామి దేవాలయం వద్ద 1846 అక్టోబర్ 6 తేదీన బ్రిటిష్ సైన్యం మోహరించి కాల్పుల వర్షాన్ని కురిపించగా ఓబన్న వీర మరణం పొందాడని అన్నారు. ఆయన స్ఫూర్తితో సంఘం ఆధ్వర్యంలో తెలంగాణలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమాల్లో జిల్లా కార్యదర్శి ఇడగొట్టి వడ్డెన్న మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో వడ్డెర వృత్తులకు రిజిస్ట్రేషన్ అయిన సొసైటీలకు బీసీ కార్పొరేషన్ నుంచి ఎటువంటి షరతులు లేకుండా లోన్లు ఇవ్వాలని తెలిపారు. 57ఏండ్లు నిండిన ప్రతి వడ్డెర కుటుంబానికి పెన్షన్ ఇవ్వాలని, స్థలం ఇచ్చి ఇల్లు కట్టి ఇవ్వాలని, రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పీట్ల లింబయ్య, కొల్లేపు సాయిలు, సంపంగి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటు అందించాలి

- తెలంగాణ ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్ మోటార్ రివైండింగ్ యూనియన్


సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తెలంగాణ ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్ మోటార్ రివైండింగ్ యూనియన్ మండల సర్వసభ్య సమావేశాన్ని మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి స్వామి హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు, రైతులకు పలు రకాలుగా సేవలు అందిస్తున్న ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్, మోటార్ రివైండింగ్ సభ్యులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందించి ఆదుకోవాలన్నారు. సమావేశంలో సభ్యుల సాధక బతకాలపై చర్చించారు. యూనియన్ సభ్యుల సమావేశాన్ని ప్రతినెల మొదటి ఆదివారం నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం గిరి స్వామిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్ మోటార్ రివైండింగ్ యూనియన్ మండల అధ్యక్షులు జాగర్ల నవీన్, ఉపాధ్యక్షులు కంప దండి అశోక్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి చింత సత్యపాల్, సలహాదారులు కాలేరు గంగాధర్, జిందం శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధికి జాతిని ఐక్యం చేయాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

భారతీయ జనతా పార్టీ ఎస్సి మోర్చా అధ్యక్షులు శివప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసి దళిత మేధావుల రౌండ్ టేబుల్ సమావేశానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ ఆశయాలకు ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తుందని తెలిపారు. అలాంటి మహనీయుని చరిత్ర మాసిపోకూడదని అంబేద్కర్ గడిపిన ప్రదేశాలు అన్ని పంచాతీర్థాల పేరుతో అంబేద్కర్ పేరును ప్రపంచంలో గుర్తించే విధంగా ప్రయత్నం చేసిన పార్టీ బిజెపి నరేంద్రమోదీ అని అన్నారు. ఢిల్లీలో ఆ మహనీయుని పేరు మీద రెండు ఎకరాల 100 కోట్లతో గొప్ప స్మారక భవనాన్ని కూడా నిర్మించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ దేశానికి ప్రథమ పౌరుడైన రాష్ట్రపతి స్థానాన్ని ఒక దళితుడు రాంనాథ్ కోవిద్, ఎస్టి మహిళకు ఇచ్చి గౌరవించిన పార్టీ బిజెపి అన్నారు. దళితులను కేవలం ఒక ఓటు బ్యాంకుగా చూస్తున్నారని తెలిపారు. ఈ దేశం సుభిక్షంగా, సురక్షితంగా ఉండాలని అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాశారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్ అని 10 ఏళ్ళు దళితులను అన్యాయం చేశారన్నారు. చేవెళ్ల ఎస్సి, ఎస్టీ డెక్లరేషన్ పేరు మీద దళితులను పచ్చి మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు, అంబేద్కర్ అభయ హస్తం పేరు మీద దళితులకు 12 లక్షలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జాగా ఉంటే 6 లక్షల ఊసే లేదన్నారు ఇండ్లు లేని దళితన్నలు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని అన్నారు. ఎస్సి కార్పొరేషన్‌తోపాటు మరో మూడు కార్పొరేషన్లు అని, సంవత్సరానికి 700 కోట్లు అని యావత్ దళిత సమాజాన్ని మోసం చేసిందన్నారు. విద్య జ్యోతి పథకం కింద పేర యావత్ దళిత విద్యార్థులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. రామాయణాన్ని రచించిన వాల్మీకిని, రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని అంబేద్కర్ వారసులుగా దేశాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. మేధావులు దేశఐక్యత, అభివృద్ధికి జాతిని చైతన్యం చేయాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సాయి వర్ధన్, బట్టు రాఘవేందర్, బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు సందీప్, సాయినాథ్, కిరణ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు


జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నవతెలంగాణ-ఆర్మూర్

జాతీయ సాఫ్ట్ బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్టు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి. ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్యంటి గంగా మోహన్ ఆదివారం తెలిపారు. ఈనెల 6న పోటీలు ప్రారంభంకాగా ఈనెల 10 తేదీవరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని నంద్యాలలో నిర్వహిస్తున్న జాతీయ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున పాల్గొంటున్నట్లు చెప్పారు.

ఎంపికైన జిల్లా క్రీడాకారులు..

బాలికల విభాగంలో..

ఎస్ సౌమ్య రాణి (పంది మడుగు), జి సాత్విక (పిప్పిరి), డి సన్నిత (పుప్పాలపల్లి),జి శ్రావిక (పిప్పిరి) కె సోనీ (మంచిప్ప), జై వైశాలి (అక్లూర్),

బాలుర విభాగంలో ..

సిహెచ్.అరవింద్ (బడా భీంగల్),జట్టు కెప్టెన్ కాగా ఎస్. లక్ష్వేందర్, (చౌటుపల్లి)) పి.కళ్యాణ్ రాజ్, (ఆర్మూర్) వి.అభినేష్, (ఆర్మూర్). లు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్ర బాల బాలికల జట్లను ప్రథమ స్థానంలో నిలపడానికి క్రీడాకారులు కృషి చేయాలని అన్నారు. వీరి ఎంపిక పట్ల

జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్ గౌడ్, జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్, జిల్లా సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లు జిల్లా సాఫ్ట్బాల్ సంఘ సంయుక్త కార్యదర్శి లు మర్యంటి సుజాత, చిప్ప నవీన్, సభ్యులు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ధైర్యంగా ఉంటే క్యాన్సర్‌ను జయించవచ్చు

- మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్
- క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కమిషనర్, పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బోర్గం జెడ్పిహెచ్ఎస్ పాఠశాల నుండి ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థతో కలిసి క్యాన్సర్‌పై ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మందమకరంద్ హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్యాన్సర్ పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని అన్నారు. భయపడకుండా డాక్టర్ల సూచనలు పాటిస్తే క్యాన్సర్ ను కూడా మొదటిలోనే జయించవచ్చని తెలిపారు. క్యాన్సర్‌ను నయం చేసే విధంగా చికిత్సలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ధైర్యంగా ఉంటే క్యాన్సర్ ను జయించవచ్చని తెలిపారు. ఈ ర్యాలీలో ఇందూర్ క్యాన్సర్ ఆస్పత్రి సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, వైద్య సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ ప్రధాన రహదారుల నుండి పాత కలెక్టరేట్ మైదానం వరకు చేరుకుంది. ఈ ర్యాలీ లో పాల్గొన్న వారికి రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా తాగునీటి బాటిళ్ల అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
సోమవారం | అక్టోబర్ 07, 2024 | www.navatelangana.com

నూతన బోరు ప్రారంభం


భూమిపూజ చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 14వ వార్డులో నీటి సమస్య ఉందని దేవునిపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీవాసులు మున్సిపల్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే ఆమె స్పందించి బోర్ వేయించి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. చెట్లు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం వల్ల పర్యావరణాన్ని కాపాడిన వారిమవుతాయని చెప్పారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నందున ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బండారి శ్రీకాంత్, కాలనీ అధ్యక్షులు రవీందర్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితురాలికి నిత్యావసర సరుకులు అందజేత


ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ వార్డుమెంబర్ బాల్‌రాజు

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన పత్తి బాలవ్వ నివాసపు ఇల్లు మూడు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కావడంతో నిత్యావసర సరుకులు, దుస్తులు సర్వస్వం అగ్నికి ఆహుతి కావడంతో తినడానికి ఏమీ లేక వారి కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడినందున మాజీ వార్డుమెంబర్ చేటారి బాల్‌రాజు స్పందించి అగ్ని ప్రమాద బాధితురాలికి 25 కిలోల బియ్యం, 2కిలోల పప్పులు, కిలో మంచి నూనె తన వంతు సహాయంగా అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేస్త్రీ గంగారాం, హరీష్, అశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం లేక అవస్థలు

- డిజిటల్ పేమెంట్‌దారులు అధిక వసూళ్లు
- యాక్టివేషన్ కోసం ఇతర జిల్లాలకు పరుగులు
- నసురుల్లాబాద్ మండల వాసుల ఇబ్బందులు



నవతెలంగాణ-నసురుల్లాబాద్

బ్యాంకర్లు సేవలను విస్తరిస్తున్నామని ప్రకటనలు చేస్తున్నా నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఏటీఎం లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నసురుల్లాబాద్ మండల కేంద్రంలో రెండు బ్యాంకులున్నాయి. ఒక్కొక్క బ్యాంక్ పరిధిలో సుమారుగా రూ.5 వేల నుంచి పది వేల వరకు ఖాతాదారులున్నారు. నసురుల్లాబాద్ గ్రామంలో జిల్లా సహకార బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ ఉండగా ఐఓబి బ్యాంక్ పరిధిలో మైలారం బొమ్మన్ దేవ్‌పల్లి, హాజీపూర్, లింగంపల్లి తండా, ఫకీర్ నాయక్ తండా, కంశేట్‌పల్లి, రాములు గుట్ట తాండ గ్రామాలున్నాయి. ఐఓబి బ్యాంక్ పరిధి గ్రామాల ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడం కోసం ప్రతి ఖాతాదారుడికి ఏటీఎం ఇచ్చారు.

కొత్త ఏటీఎం మిషన్ తెస్తామని..

గతంలో ఏటీఎం కోసం ప్రత్యేకంగా ఓ నూతన గది ఏర్పాటు చేసి ఏటీఎం సెంటర్ కొనసాగించారు. ఇలా చాలా రోజుల పాటు కొనసాగింది. కొత్త మిషన్ తీసుకొస్తామని పాత ఏటీఎం మిషన్ తీసుకువెళ్లారు. ఖాతాదారులు కొత్త ఏటీఎం మిషన్ వస్తాదనే ఆశలో ఉన్నారు. గత మూడు సంవత్సరాలుగా కొత్త ఏటీఎం మిషన్ రాక పోవడంతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. ప్రతి ఖాతాదారునికి కొత్త ఏటీఎం కార్డు ఇస్తున్నారు. ఏటీఎం కార్డు యాక్టివేషన్ కోసం 500 వందలు ఖర్చు చేసి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. ఒక్కోసారి నిజామాబాద్ కేంద్రంలో ఉన్న ఒకే ఒక ఐఓబి బ్యాంక్ ఏటీఎం పనిచెయ్యకపోవడంతో మరోసారి వెళ్ళవలసి వస్తుంది. బాన్సువాడ, ఎల్లారెడ్డి, బోధన్, నిజామాబాద్ డివిజన్ పరిధిలో ఐఓబి బ్యాంక్ ఏటీఎం సెంటర్ లేకపోవడంతో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్ళవలసి వస్తుంది.

డిజిటల్ పేమెంట్‌కు అధిక కమీషన్ చెల్లింపు..

డిజిటల్ పేమెంట్లకు అలవాటు పడిన క్రమంలో యూపీఐ తదితర యాప్‌లను వినియోగిస్తున్నారు. నెట్‌వర్క్ లేకపోవడం వలన డిజిటల్ పేమెంట్లకూ తంటాలు పడుతున్నారు. ఊరి చివరకో లేదా పొరుగు గ్రామానికో వెళ్లి డిజిటల్ పేమెంట్ చేసి వచ్చాక డబ్బు పొందుతున్నారు. రూ.1000 కావాలంటే రూ.50 కమీషన్ చెల్లించాల్సి వస్తుండటంతో తమ జేబులకు చిల్లులుపడుతున్నాయని ఖాతాదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా బ్యాంక్ ఉన్నతాధికారులు స్పందిస్తూ నసురుల్లాబాద్ మండల కేంద్రంలో ఏటీఎం సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఐఓబి బ్యాంక్ ఖాతాదారులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేగా ఉండి బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తారా..?

- బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సాప శివ రాములు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఉండి మీ సొంత కులం కోసం, ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల కోసం మీరు కోర్టులో కేసులు వేసి బీసీలకు అన్యాయం చేస్తారా..? అని బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు సాప శివరాములు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఓసీ జనాభా ఎంత ఉందో అందులో ఇడబ్ల్యూఎస్ కోటాలో ఎంత మంది వస్తారు? తెలుసుకొని కేసు వేయాలని, వీటి వివరాలు తెలియాలని బీసీలమైన తాము బీసీల లెక్కలను తేల్చాలని అంటున్నామని తెలిపారు. అందులో భాగంగానే కులగణన కావాలని అడుగుతున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మా కులాలకు గుడులకు, సంఘం భవనాలకు డబ్బులు ఇస్తే మేము సంతోషించామని, మీ సొంత నిధులతో పనులు చేస్తామన్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఏ పనులు ప్రారంభించలేదని తెలిపారు. తమకు జరిగే అన్యాయాలపై మీరు మాట్లాడలేదని, కానీ ఇప్పుడు ఉద్యోగాల్లో అన్యాయం చేస్తున్నారని తెలిపారు.

రక్తదానంలో ఆదర్శం.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

- ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు


రక్తదానం చస్తున్న సంతోష్‌రెడ్డి

నవతెలంగాణ- కామారెడ్డి

కామారెడ్డి సత్తవ్వ (68)కు హైదరాబాద్‌లోని ప్రైవేట్ వైద్యశాలలో ఆపరేషన్ నిమిత్తమై ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ధర్మారావుపేట గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సంతోష్ రెడ్డి మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి ఓ పాజిటివ్ రక్తాన్ని అందజేసినట్టు ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ గతంలో చాలా సందర్భాల్లో అత్యవసర పరిస్థితులలో ఉన్నవారికి రక్తాన్ని అంద జేసి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్న సంతోష్ రెడ్డికి ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తరఫున అభినందనలు తెలియజేశారు. యువత రక్త దానానికి ముందుకు రావాలని రక్తదానం పట్ల ఉన్న అపోహలను వీడనాడాలని అన్నారు.

నేడు మంగల్‌పాడ్‌లో బతుకమ్మ పండుగ

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగళ్‌పహాడ్ గ్రామంలో సోమవారం బతుకమ్మ పండుగను నిర్వహిస్తున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ పెద్దలు తెలిపారు. తమ వాకిళ్ళ ముందర వివిధ రకాల పూలతో, కాగితాల బతుకమ్మలను రంగురంగులతో పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సవాలను జరుపుకుంటారు. భాజాభజంత్రీల మధ్య మహిళలు, చిన్నారులు బతుకమ్మలను హనుమాన్ మందిరం వద్దకు తీసుకెళ్లి అక్కడ ఆటపాటలతో బతుకమ్మను ఆడుతారు.

చెరువుగట్టుపైన ఏర్పాటు పూర్తి..

బతుకమ్మ పండగ సందర్భంగా మంగళ్‌పాడ్ గ్రామంలో చెరువు గట్టు పక్కన విద్యుత్ అలంకరణతో పాటు పారిశుధ్య కార్యక్రమాలను పూర్తి చేసినట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి తెలిపారు. గ్రామస్తులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకు న్నట్లు ఆయన పేర్కొన్నారు. బతుకమ్మలను నిమజ్జనం చేసే వారు సాయంకాలం ఏడు గంటల లోపు చెరువులో నిమజ్జనం చేసిన అనంతరం గ్రామస్తులందరూ తమ ఇంటికి చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బోధన్ ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణ సమీపంలో గల ప్రభుత్వ ఐటిఐలో ఖాళీలుగా ఉన్న వివిధ ట్రేడ్‌లలో ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శాంతారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసై, 14 సంవత్సరాలు పైబడిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ ట్రేడ్‌లో ఒక సంవత్సరం కోర్సుకు 40 సీట్లు ఉన్నాయని, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ ట్రేడ్ ఒక సంవత్సరం కోర్సులో 40 సీట్లు ఉన్నాయని, ఆర్టిషన్ యూజింగ్ అడ్వాన్స్డ్ టూల్ ట్రేడ్‌కు ఒక సంవత్సరం కోర్సులో 20 సీట్లు ఉన్నాయని, బేసిక్ డిజైనర్ అండ్ విర్చువల్ వెరిఫైయర్ మెకానికల్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల కోర్సులో 24 సీట్లు ఉన్నాయని, అడ్వాన్స్ సిఎంసి మెషినింగ్ టెక్నీషియన్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల కోర్సుకు 24 సీట్లు ఉన్నాయని, మెకానికల్ ఎలక్ట్రికల్ వెహికల్స్ ట్రేడ్‌లో రెండు సంవత్సరాల కోర్సుకు 24 సీట్లు ఖాళీగా ఉన్నాయని వాటి భర్తీ కోసం ఆన్ లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు 10వ తరగతి పాస్ అయి ఉండాలని సూచించారు. ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని ఐటిఐలో హాజరుకావాలని సూచించారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ గ్రామంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులతో పాటు సిబ్బంది తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది సాయికుమార్ మాట్లాడారు.. పారిశుధ్య కార్మికులుగా సిబ్బందిగా పనిచేస్తున్న గత తొమ్మిది నెలల బకాయి వేతనాలను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏకకాలంలో మంజూరు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం చిత్రపటానికి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నెహ్రూనగర్ గ్రామపంచాయతీ కారోబార్ సాయికుమార్, ఏఆర్‌పి క్యాంప్ గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా కంపోస్ట్‌షెడ్‌లు


కొప్పర్తి క్యాంప్ రోడ్డు పక్కన నిరుపయోగంగా మారిన కంపోస్ట్ షెడ్

నవతెలంగాణ-బోధన్

గత ప్రభుత్వం ఎంతో ఉన్నత లక్ష్యంతో లక్షలు వెచ్చించి నిర్మించిన కంపోస్ట్‌షెడ్‌లు నేడు నిరుపయోగంగా మారాయి. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మించిన కంపోస్ట్ షెడ్‌లలో ఇంటింటి నుంచి చెత్త సేకరించి తడి, పొడి చెత్త వేరుచేసి సేంద్రీయ ఎరువులు తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ బోధన్ ఉమ్మడి మండలంలో కొన్ని గ్రామాల్లో తప్ప సేంద్రియ ఎరువులు ఏ కంపోస్టు షెడ్‌లోను తయారు చేయడం లేదు. దాంతో గ్రామాలలో రైతులకు సేంద్రియ ఎరువులు లభించక రసాయన ఎరువులను ఉపయోగిస్తున్నారు. దాంతో భూసారం తగ్గి దిగుబడులు నష్టపోతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరడం లేదు. పలు గ్రామాలలో కంపోస్టు షెడ్ వద్ద నిర్మించిన మరుగుదొడ్ల రేకులు, తలుపులు ధ్వంసమయ్యాయి.

రోడ్డు పక్కన చెత్తకు నిప్పు..

సాలూర మండల కేంద్రంలో గతంలో మంజీర నది సమీపంలో కంపోస్టు షెడ్ నిర్మించారు. కానీ నూతన వంతెన నిర్మాణంలో భాగంగా అక్కడ ఉన్న కంపోస్టు షెడ్‌ను తొలగించారు. అయితే ప్రస్తుతం సాలూరలో కంపోస్టు షెడ్ ఎక్కడ కూడా ఏర్పాటు చేయలేదు. దాంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రధాన రహదారి పక్కన ఇంటింటి నుంచి సేకరించిన చెత్త డంపింగ్ చేస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పు పెడుతున్నారు. దాంతో వాటి నుంచి వచ్చే పొగ వలన వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కావున చెత్త డంపింగ్‌ను మరోచోటికి మార్చాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు.

అబ్దుల్ కలాం స్ఫూర్తితో
సమాచార హక్కు చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న సమాచార హక్కు చట్టం రాష్ట్ర డైరెక్టర్ సలీం

నవతెలంగాణ-సదాశివనగర్

సమాచార హక్కు చట్టాన్ని అబ్దుల్ కలాం స్ఫూర్తితో ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమాచార హక్కు చట్టం రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఎ సలీం అన్నారు. ఆదివారం మండలంలోని అడ్డూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని 2005లో ఏపీజే అబ్దుల్ కలాం ప్రారంభించారన్నారు. సమాచార హక్కు చట్టం వచ్చి 19 సంవత్సరాలు అవుతున్న ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లక పోవడం బాధాకరమన్నారు. ఈనెల 11 వరకు సమాచార హక్కు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 11న కలెక్టర్ చేతుల మీదుగా కేక్ కటింగ్ ఉంటుందని, పేద ప్రజలకు సామాన్యులకు ఈ చట్టం గురించి తెలియజేసేందుకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార బోర్డు ఏర్పాటు చేయాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. సమాచార చట్టాన్ని దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు సదక్ అలీ, మండల జనరల్ సెక్రెటరీ నితీన్‌గౌడ్, ఆర్టిఏ సభ్యులు అల్తాఫ్, రంగమ్మోహన్, లింగం, గ్రామస్తులు మోసర్ల శ్రీకాంత్‌రెడ్డి, తండా స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ధాన్యం
కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- మాజీ జెడ్పీటిసి ఉమ్మన్నగారి మనోహర్ రెడ్డి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

వెంటనే నాగిరెడ్డిపేట్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ జెడ్పీటిసి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని బంజారా తండాలో ఆరబోసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు అయ్యే విధంగా ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావలసిన ఏర్పాట్లను చేయాలని ఆయన కోరారు.

హరీష్‌రావును కలిసిన మాజీ జెడ్పీటిసి..

మాజీ మంత్రి హరీష్ రావును నాగిరెడ్డిపేట్ మాజీ జెడ్పీటిసి మనోహర్ రెడ్డి ఆదివారం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి పతంలో నడిపే విధంగా చూడాలని తద్వారా నిధులకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటిసి

పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న జంగం గంగాధర్

నవతెలంగాణ-బోధన్

గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం బోధన్ మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు వెంటనే విడుదల చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, జీవో నెంబర్ 60 అమలు చేయాలని కోరారు. వాటర్ మేన్‌కు రూ.16,000, కారోబార్‌కు రూ.19,500, ట్రాక్టర్ డ్రైవర్‌కు రూ.21,000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కోశాధికారి సాగర్, పోశెట్టి, బోధన్ మండల అధ్యక్షులు గణేష్, శ్రీనివాస్, వీరేశం, సాలూర మండల అధ్యక్షుడు విజయ్ పటేల్, నాగనాథ్, కీర్తి తదిపారులు పాల్గొన్నారు.

14న తథాగత్ గౌతమ్ బుద్ధ విహార్ స్థాపన

- మాజీ ఎంపీపీ ప్రజ్ఞ కుమార్


బుద్ధ విహార్ స్థాపన కోసం ఏర్పాట్లు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలో ఈనెల 14న తథాగత్ గౌతమ్ బుద్ధ విహార్ స్థాపన చేయనున్నట్టు మండల మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్ ఆదివారం తెలిపారు. అందరి సహకారంతో మద్నూర్‌లో గౌతమ్ బుద్ధ విహార్ స్థాపించుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బుద్ధ వేద పండితులు, ప్రముఖులు హాజరవుతారని ఈ కార్యక్రమాన్ని విజయవంతానికి పెద్ద ఎత్తున జనాలు హాజరుకావాలని కోరారు.

ప్రయివేటు ఉపాధ్యాయులకు ఘన సన్మానం


ఉపాధ్యాయులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-బోధన్

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం లయన్స్ ఐ హాస్పిటల్ సభా ప్రాంగణంలో ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ సీఐ ఓ శ్రీ వెంకట్ నారాయణ, లయన్స్ కంటి ఆసుపత్రి నిర్వహకులు బసవేశ్వరరావు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మీ, ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొడాలి కిషోర, ట్రస్మా జిల్లా కోశాధికారి దిగంబర్, అధ్యక్షులు ముస్త్యాల హరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి మిద్దెల రాజు, కోశాధికారి కృష్ణమోహన్, గౌరవాధ్యక్షులు వై.శ్రీనివాస్, సూర్య ప్రకాష్, జయప్రకాష్, సురేష్, మనోజ్, చక్రవర్తి, బలరాంరెడ్డి, సంతోష్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో జుక్కల్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పెద్దగుల్ల గ్రామంలో నెలకొల్పిన దుర్గామాత మండపంలో శనివారం రాత్రి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట డోంగ్లి మండల ముఖ్య నాయకులు నాగేష్ పటేల్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

పెన్షన్ పంపిణీలో అవకతవకలపై ఎమ్మెల్యే సీరియస్

- అధికారులు ఏంచేస్తున్నారంటూ ఆగ్రహం?

నవతెలంగాణ-ధర్పల్లి

పెన్షన్ పంపిణీలో అవకతవకలపై నవతెలంగాణ పత్రికలో ఆదివారం వచ్చిన వార్తకు స్పందించి రూరల్ ఎమ్మెల్యే అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ డబ్బులు గోల్ మాల్ కావడం ఏంటని, వృద్ధుల పెన్షన్ పంపిణీలో కక్కుర్తి పడి కాజేయడంతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, ఇంత జరుగుతుంటే అధికారులు ఏంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. జరిగిన ఘటనపై వాస్తవాలు తెలుసుకొని బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని చుసించినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ గ్రామ జాతీయ రహదారిపై బైకుపై వెళ్తున్న వ్యక్తి డివైడర్‌ను ఢీకొని కిందపడిపోగా గుర్తు తెలియని వాహనం తలపై నుంచి వెళ్లగా తల నుజ్జు నజ్జయి మరణించాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని బోకర్ మండలం రేనాపూర్ గ్రామానికి చెందిన పండిత్ గోరి(28) బాల్కొండ మండలం జలాల్పూర్ గ్రామం నుండి తన సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. దారి తప్పి అర్గుల్ వైపు రాగా గ్రామ శివారులోని కోల్డ్ స్టోరేజ్ వద్ద డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే చనిపోయాడు. మృతునికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుని తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వడ్డె ఓబన్నకు ఘన నివాళులు



ఓబన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న కౌన్సిలర్

నవతెలంగాణ-ఆర్మూర్

స్వాతంత్ర సమరయోధులు, పోరాట యోధుడు వడ్డె ఓబన్న 178వ వర్థంతి సందర్భంగా పట్టణంలోగల వడ్డె ఓబన్న విగ్రహం వద్ద వర్థంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కౌన్సిలర్ సంగీతా ఖాందేష్ ఓబన్న విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహ రెడ్డితో పాటు ఓబన్న చేసిన సాహసోపేతమైన పోరులో సైనిక అధ్యక్షుడిగా వడ్డే ఓబన్న పోషించిన వీరోచిత పాత్రను చరిత్రలో లిఖించదగిన విషయం అని అన్నారు. వడ్డే ఓబన్న తన 9000 మంది సైనికులతో కలిసి బ్రిటిష్ వారిపై వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు. వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, సంతోష్ వడ్డెర సంఘం పెద్ద మనుషులు గండికోట రాజన్న, మాయని ఎల్లయ్య, ఎత్తరీ రాజారాం, దండుగుల వెంకటి, మక్కల సాయినాథ్, వడ్డెర సంఘ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని హొన్నాజీపేట గ్రామానికి చెందిన బండి నర్సవ్వ (40) జీవితంపై విరక్తితో గ్రామ చెరువులో పడి మృత్తి చెందినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. మృతురాలికి గత కొన్ని రోజులనుండి చెవులు వినిపించక పోవడంతో మానసికంగా కుంగిపోయింది. మతిస్థిమితం లేకుండా ప్రవర్తించేది. కాగా శనివారము సాయంత్రం 6 గంటల నుండి కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువులకు వద్ద వెతికారు. ఎలాంటి ఆచూకీ దొరకలేదు. ఆదివారము ఉదయం చెరువు ప్రాంతంలో వెతుకగా శవం నీటిలో తేలుతూ కనిపించింది. కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించగా, కేసు నమోదు చేసి శవాన్ని బయటకు తీసి పంచనామా నిమిత్తం జిల్లాకేంద్ర ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేదకుటుంబానికి ఆర్థిక సహాయం

- మానవత్వం చాటుకున్న పూర్వవిద్యార్థులు

నవ తెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ పట్టణంలోని బోయిగల్లిలో ఉంటున్న చిన్నయ్యలక్ష్మి దంపతులకు తినడానికి తిండి లేక హాస్పిటల్ ఖర్చులకు డబ్బులేక న్నారని తెలిసి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీ భారతీ విద్యాలయం 2001-02 పదవ తరగతి పూర్వ విద్యార్థులు చిన్నయ్యకు రూ. 7500 ఆర్థిక సాయం ఆదివారం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వారి అవసరాలు, ఆస్పత్రి ఖర్చులకోసం తోచినంత సహాయం చేశామన్నారు. కార్యక్రమంలో బొదిరే సుమన్, సురేష్, ఆరీఫ్, నర్సింగ్ రావు, బండి శ్రీనివాస్, సుమలత, తదితరులు పాల్గొన్నారు,

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

- డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు విషారదన్ మహారాజ్
- డిఎస్‌పి పార్టీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే ధర్మసమాజ్ పార్టీ లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షులు విశారదన్ మహారాజ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో ని కంఠేశ్వర్ బైపాస్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 90శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం డీఎస్‌పి పనిచేస్తుందని అన్నారు. అలాగే రానున్న స్థానిక ఎన్నికల్లో సమరంలో ఉండాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల ఇబ్బందులు పరిష్కరించే విధంగా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నేతలపై ఉందన్నారు. అధికారం, పదవుల కోసం కాకుండా బలహీనవర్గాల సమస్యలను పరిష్కరించినప్పుడే పార్టీ అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుమన్, రాష్ట్ర నాయకులు ప్రేమ్, జిల్లా అధ్యక్షులు మహిపాల్, రాజేశ్వర్, ప్రశాంత్, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

అక్రమ మొరం తరలింపుపై తహసీల్దార్ అనుసరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం శనివారం సాయత్రం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కమురంభీం చౌరస్తా సమీపంలోని 110 ఎకరాల ప్రభుత్వ స్థలం నుంచి అక్రమార్కులు మొరం తరలించుకుపోతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ తతంగం తహసీల్దార్‌కు తెలిసే జరుగుతుందని పట్టణంలో ప్రచారం అవుతున్నా ఆయన ఏమి తెలువనట్టుగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఏదైనా ఉంటే మైనింగ్‌శాఖకు చెప్పుకోండి అంటూ నిర్లక్ష్యపు సమాదానం చెబుతున్న తహసీల్దార్ పై చర్యలు తీసుకొని, సదరు భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కారుణ్య నియామకాలకోసం ఎదురుచూపులు?

- అమలుకు నోచనీ జీవో
- బదిలీల్లోనూ అశాస్త్రీయ ర్యాండమైజేషన్
- ఆందోళనలో వీఆర్ఏలు



ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు (ఫైల్)

నవతెలంగాణ-ఆర్మూర్

కారుణ్య నియామకాలకోసం 61ఏండ్లు పైబడిన వీఆర్ఏలకు ఎదురుచూపులు తప్పడంలేదు. కారుణ్య నియామకాల జీఓ జారీ చేసి సంవత్సరం దాటినా అమలుకు నోచుకోవడంలేదు. మరోవైపు కారుణ్య నియామకాల ద్వారా వారసులను ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో జిల్లాలోని పలు మండలాల్లో తహసిల్దార్లకు వినతి పత్రాలు అందజేశారు. మరోవైపు పూర్వ వీఆర్ఏలకు పదోన్నతి వచ్చిన సంతోషమే తప్ప కుటుంబాలకు దూరం అవుతూ ఉద్యోగాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమ సమస్యలు తీర్చాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి సమగ్ర కుటుంబ సర్వే భూ రికార్డుల ప్రక్షాళన, సామాజిక పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మొదలుకొని రైతుబంధు, దళిత బంధు వరకు అనేక సర్వేలు చేయడం, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వీఆర్ఏలు ప్రధాన భూమిక పోషిస్తున్నారు. రాత్రింబవళ్లు చాకిరి చేస్తున్న వారి శ్రమకు తగ్గ ఫలితం దక్కలేదు. గత రెండు సంవత్సరాల క్రితం వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో సమ్మెలు సైతం నిర్వహించారు. గత ప్రభుత్వం 3797 మంది రాష్ట్రవ్యాప్తంగా 61 ఏళ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియామకం కోసం జీవోలు జారీ చేసింది. ఉన్నత చదువులు చదివిన వారు పది నుండి 12 సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిర్విరామ కృషి చేస్తున్నారు. 61 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏలు 200పైగా మృత్యువాత పడ్డారు. మరికొందరి వారసులు సైతం మృతి చెందారు. కారుణ్య నియామకాల జీవో జారీ అయిన వీఆర్ఏల వారసులకు నియామక ఉత్తర్వులను ఇవ్వకపోవడంతో

మరింత ఆవేదనకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నియామకానికి చర్యలు చేపట్టి తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

అశాస్త్రీయమైన ర్యాండమైజేషన్ ...

గత ప్రభుత్వం 2023 జూలైలో పూర్వ వీఆర్ఏ లందరిని జీవో నెంబర్ 81 ద్వారా పదోన్నతి కల్పించింది. అర్హతలను బట్టి వివిధ క్యాడర్లలో జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, రికార్డు అసిస్టెంట్లు, ఆఫీస్ సబార్డినేట్లుగా కిందిస్థాయి ఉద్యోగాల్లో భర్తీ చేసింది. కొందరిని అశాస్త్రీయమైన ర్యాండమైజేషన్ ద్వారా జిల్లాస్థాయి పోస్టులను వివిధ జిల్లాలకు, స్థానికతకు విరుద్ధంగా బదిలీ చేసింది. పదోన్నతి వచ్చిన సంతోషం కంటే కుటుంబానికి దూరంగా ఉంటూ మానసిక క్షోభ అనుభవిస్తూ ఉద్యోగం చేస్తున్నారు.

ఇతర జిల్లాల్లో పోస్టింగులు

జిల్లా నుండి 201 మంది వీఆర్ఏలు సూర్యాపేట, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, హనుమకొండ, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సంగారెడ్డి, నారాయణపేట, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారు. సుమారుగా 200 నుండి 500 కిలోమీటర్ల దూరంలో కుటుంబాలకు, వృద్ధ తల్లిదండ్రులకు దూరంగా ఉద్యోగం చేస్తున్నామని వీఆర్ఏలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, వికలాంగులు అని తేడా లేకుండా ఇతర జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారని వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బి- 17 జీవో ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లిన ఉద్యోగులను స్థానికత ద్వారా సొంత జిల్లాల్లో పోస్టింగులు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి
బియ్యం సాయినాథ్,
జిల్లా సంయుక్త కార్యదర్శి



జిల్లాలోని అనేకమంది పూర్వ వీఆర్ఏలు చనిపోయారు. వారి వారసులను గుర్తించి కారుణ్య నియామకాల ద్వారా నియమించాలి.

సొంత జిల్లాలకు రప్పించాలి
గున్నం సంతోష్, జిల్లా కన్వీనర్



ఇతర జిల్లాలో బదిలీ అయిన జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్ లను సొంత జిల్లాకు రప్పించా. 61ఏండ్లు పైపడిన బీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి.

ఆడపిల్లను పుట్టనిద్దాం.. ఎదగనిద్దాం

- ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఆడపిల్లను పుట్టనిద్దాం.. పెరగనిద్దాం.. ఎదగనిద్దాం అనే నినాదంతో బతుకమ్మ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ .. చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు అని వయసుతో సంబంధం లేకుండా లైంగిక దాడులు, హత్యాచారాలకు పాల్పడుతున్న మృగాలకు కఠినమైన శిక్షలు వేయాలన్నారు. ఆడపిల్లల విషయంలో జోక్యం చేసుకోవాలంటే భయపడే విధంగా శిక్షలు ఉండాలని తెలిపారు. రానున్న కాలంలో మహిళలకు రక్షణ కల్పించే విషయంలో ప్రభుత్వాలు బాధ్యత నిర్వహించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు వనజ, అర్చన కళావతి, బస్తీ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

- వంజరి సంఘం ఆధ్వర్యంలో అందజేత



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థినులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి, నిజామాబాద్‌కు చెందిన వంజరి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నగరంలోని నాందేవాడలో గల రావూజి సంఘం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర ఉపాధ్యక్షులు మాస్టర్ వంజరి శ్రీనివాసరావు తెలిపారు. పదో తరగతిలో అత్యధిక మార్కులతో రాణించిన బాలికలను ఎంపిక చేసి వారికి పదివేల రూపాయల చెక్కులను అందజేశారు. మొత్తం 15 మంది బాలికలకు చెక్కులను అందజేసినట్టు తెలిపారు. ఈసందర్భంగా వంజరి సంగ రాష్ట్ర ప్రతినిధులు మాట్లాడుతూ..

పెన్షన్ విద్యార్థులకు సహాయ సహకారాలు, హాస్టల్లో ఉండే బాలురకు సహాయ సహకారాలు, పేద విద్యార్థుల్లో ప్రతిభావంతులకు పైచదువుల నిమిత్తం ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు కాలేరు గడ్డం శ్రీనివాస్, మాయావర్ సాయిరాం, గోపాల్ శ్రీనివాస్(అయ్యప్ప), పెటేరీ రాజు, రాష్ట్ర ట్రస్ట్ సభ్యులు మాస్టర్ శంకర్, జిల్లా అధ్యక్షులు భోనేకర్ భూమయ్య, నగర అధ్యక్షులు గంగోని గంగాధర్ బిజెపి, స్కూల్ అధ్యక్షులు చంద్రశేఖర్, పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు రవి, పాఠశాల కమిటీ ప్రధాన కార్యదర్శి లడ్డు నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

డంపింగ్ యార్డు పరిశీలన

నవతెలంగాణ-కంఠేశ్వర్



కంపోస్ట్ షెడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారం ప్రాంతంలో గల డంపింగ్ యార్డును నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరంద్ ఆదివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తను తడి, పొడిగా వేరు చేయాలని, చెత్తను ప్లాస్టిక్ డ్రైనేజీలు, నాళాల్లో వేయకూడదని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో, రోడ్లపై, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దన్నారు. చెత్తను మున్సిపల్ వాహనాలకు మాత్రమే ఇవ్వాలని, తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో మూత్ర విసర్జన చేయొద్దని, ప్రజా మరుగుదొడ్లను వాడాలని అన్నారు. నిజామాబాద్ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించబడిందని, ప్లాస్టిక్ బదులుగా జూట్, క్లాత్ బ్యాగులను మాత్రమే వాడాలని తెలిపారు. ఆస్తి పన్ను నీటి చార్జీలు సకాలంలో చెల్లించాలని, వ్యాపార సంస్థలు అన్ని ట్రేడ్ లైసెన్సు తీసుకుని మాత్రమే తమ కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. యూజర్ చార్జీలు సకాలంలో చెల్లించాలని, పన్నులు సకాలంలో చెల్లించి నగర పాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు.కమిషనర్ వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం

నవతెలంగాణ-ఆర్మూర్

ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రజా సమస్యల పరిష్కారంలో జిల్లా అభివృద్ధికై కృషి చేయడం అభినందనీయమని ఉత్తర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. ఆదివారం పీసీసీ అధ్యక్షునికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ భూములు, చెరువులు, దేవాలయ భూములు, వక్ఫ్ భూములు కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని, హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలో వస్తుందని చెప్పడం హర్షనీయమని అన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

నవతెలంగాణ-ఉట్నూర్

విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన వెడ్మ మనిషాను శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడే తత్త్వం పట్టుదల కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో లక్ష్యం గొప్పదై ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు బానిస కావద్దని, నిత్యం పుస్తకాలను చదువుతు ఉండాలని సూచించారు. సమాజంలో అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని స్ఫూర్తిగా తీసుకొని అనుకున్న లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు వెళాలన్నారు. మనీషా వైద్య రంగంలో ఉన్నత చదువుల చదువుకొని ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో వెడ్మ శ్యాంరావ్ టీచర్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని నిలదీయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దుకాణాల్లో పని చేసే కార్మికుల సంక్షేమం కోసం ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరముందని విశ్రాంత కార్మికశాఖ అధికారి చిట్యాల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని నేతాజీచౌక్‌లో దుకాణాల్లో పని చేసే కార్మికులకు కార్మిక సంక్షేమ చట్టాల గురించి అవగాహన కల్పించారు. చట్టాలు, పథకాలు తెలియక నేడు కార్మికులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత కార్మికశాఖ అధికారి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ 37 ఏండ్లు కార్మిక శాఖలో పని చేసిన తనకు వారి సమస్యల గురించి అవగాహన ఉందన్నారు. కార్మికులు ప్రశ్నించనిదే పథకాలు రావన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలవుతున్న ఇప్పటి వరకు కార్మికశాఖ మంత్రి లేడన్నారు. ఎలా కార్మిక సమస్యలు పరిష్కరం అవుతాయని ప్రశ్నించారు. కార్మికులు ఐక్యంగా ఉండి ఓటు అనే ఆయుధంతో ప్రభుత్వాన్ని ఎప్పుడైతే బయపేడుతారో అప్పుడు పథకాలు సక్రమంగా వస్తాయన్నారు.

వైభవంగా గంగనీళ్ల జాతర

- ఉదయం నుంచి భక్తుల తాకిడి

నవతెలంగాణ-సారంగపూర్

మండలంలోని ఆడెల్లి మహాపోచమ్మ జాతర రెండు రోజుల పాటు జరిగిన గంగ పోచమ్మ జాతర ఆదివారం సాయంత్రం ముగిసింది. శనివారం మధ్యాహ్నం పోచమ్మ నగలను అడెల్లి దేవాలయం నుంచి వేలాది మంది భక్తులు కలిన డకతో 30 కిలో మీటర్ల పాటు అడెల్లి, సారంగాపూర్, యకరపల్లి, ప్యారముర్, మడగాం, దిలావర్‌పూర్, బన్సపల్లి, కంజర్, మల్లాపూర్, మీదుగా సాంగ్వి గ్రామానికి చెరుకొని శనివారం అక్కడే బస చేసి, ఆదివారం ఉదయం గోదావరి నది జలాలతో నగలను శుద్ధి చేసి తిరిగి అదే దారి గుండా భక్తులు నగలను తీసుకొని దేవాలయానికి చేరుకొన్నారు. గ్రామ గ్రామాన భాజాభజంత్రీల నడుమ మంగళ హారతులతో స్వాగతం పలికి అమ్మవారి నగల మూటను దర్శించి మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రానికి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ భక్తులు తెచ్చిన గంగ జలాలతో దేవిని అభిషేకం చేసి నూతన వస్త్రాలు కట్టి అమ్మవారిని నగలతో అలంకరించి మంగళ హారతులిచ్చారు. వచ్చిన భక్తులకు దేవి దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు అందిచారు. దీంతో జాతర ముగిసింది. ఆదివారం వేకువ జాము నుంచి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్రలోని నాందేడ్, చంద్రపూర్, నాగపూర్ జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అమ్మవారికి పెరుగన్నం నైవేద్యంగా సమర్పించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు కాలినడకన ప్రయివేట్ వాహనాలలో అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

భారీ బందోబస్తు ఏర్పాటు...

శనివారం ఉదయం, ఆదివారం సాయంత్రం వరకు జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ రమేష్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ జానకి షర్మిల ఆదేశానుసారం డీఎస్పీ గంగారెడ్డి అధ్వర్యంలో సీఐ రామకృష్ణ, స్థానిక ఎస్సై శ్రీకాంత్ బందోబస్తు నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా.వేదవ్యాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అవసరమైన భక్తులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు.

శెట్టిపల్లి సంగారెడ్డిలో బోనాలు


బోనాలతో మహిళలు

నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గామాతకు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఇంటింటికి బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. దుర్గామాత మండపం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

5

సోమవారం | అక్టోబర్ 07, 2024 | www.navatelangana.com

ఉచిత షుగర్ పరీక్షలు


షుగర్ పరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-పిట్లం
మండల కేంద్రంలో ఇటీవల నూతనంగా ప్రారంభించబడిన త్రిశూల్ ప్రైవేటు హాస్పిటల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ రశ్మిత ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 12 మంది షుగర్ పరీక్షలు నిర్వహించగా నలుగురికి షుగర్ నిర్ధారణ కావడంతో వారికి నెలకు సరిపడా మందులను ఉచితంగా పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు కాశిరెడ్డి, కార్యదర్శి వేణుగోపాల్, హాస్పిటల్ డైరెక్టర్లు సుధాకర్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

- క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి
- రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- గురుబసంత్ స్మారక సీనియర్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


బ్యాటింగ్ చేసి క్రీడలను ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)
వ్యసనాలకు గురికాకుండా, క్రీడలపై ఆసక్తి చూపుతూ, క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని అలాగే బాన్సువాడ గురు బసంత్ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బాన్సువాడ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురుబసంత్ స్మారక సీనియర్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ముందుగా గురు బసంత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోచారం, కాసుల క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. రాష్ట్ర ఆగ్రో సంస్థ చైర్మన్ కాసుల బాలరాజ్ బౌలింగ్ వేయగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి బ్యాటింగ్ చేశారు. అనంతరం కాసుల బాలరాజ్ బ్యాటింగ్ చేయడం అందరినీ ఆకట్టుకుంది. బసంత్ జ్ఞాపకార్థం క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, కష్టారెడ్డి, ఖలేక్, ఎజాజ్, క్రీడాకారులు బాల్‌నాథ్, దేవేందర్, రమణ, ఆయాజ్, అమీన్, వాజిద్, ఫైజల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యనిషేధం.. ఏకగ్రీవ తీర్మానం


తీర్మానపత్రం చూపుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి
ఎల్లారెడ్డి మండల పరిధిలోని అజామాబాద్ (అంకుల్ పేట్) గ్రామంలో మద్యం అమ్మకాలు నిషేధించాలని ఆదివారం గ్రామస్తులంతా సమావేశమై ఏకగ్రీవంగా తీర్మానించారు. మద్యం తాగుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని, గ్రామంలో మద్యం అమ్మకాలు నిలిపివేయాలని, ఎవరైనా గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.50 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సంపూర్ణ మద్య నిషేధం చేసి తమ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా నిలుపుకోవాలని గ్రామస్తులందరూ నిర్ణయించుకుని లిఖితపూర్వకంగా తీర్మానించుకున్నారు. యువతతో పాటు అందరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆదర్శంగా నిలవడానికి పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పట్లోళ్ల కిష్టయ్య, బాగయ్య, కుమ్మరి సాయన్న, లచ్చిరాం, యాదగిరి, గాండ్ల రాజు, కుమ్మరి శీను, పందరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కోఆర్డినేషన్ మండల కమిటీ నియామకం

నవతెలంగాణ-రామారెడ్డి
కాంగ్రెస్ కోఆర్డినేషన్ మండల కమిటీని నియమించినట్లు ఆదివారం లేఖ సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యింది. అరవింద్‌గౌడ్ (ఉప్పల్వాయి), నారెడ్డి మోహన్‌రెడ్డి (పోసానిపేట్), గీరెడ్డి మహేందర్‌రెడ్డి (పోసానిపేట), తూర్పు రాజు (రామారెడ్డి), సుపని రవి (రామారెడ్డి), గోపి (రామారెడ్డి), కిషన్ యాదవ్ (గొల్లపల్లి), మహేష్ యాదవ్ (గొల్లపల్లి), రామ్‌సింగ్ (రాజమ్మ తండా), అంజల్‌రెడ్డి (కన్నాపూర్)ను నియమించారు. లేఖపై అధ్యక్షుడి సంతకం, తేదీ లేకపోవడంపై వాస్తవమా, అవాస్తవమా అనే చర్చ జరుగుతోంది.

మండల కోఆర్డినేషన్ కమిటీ నుంచి తొలగించాలి

- జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి
మండల కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ నుంచి తనను తొలగించాలని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుకు వినతి చేశారు. పోసానిపేట గ్రామం నుంచి కోఆర్డినేషన్ కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా నియమించినందున, గ్రామంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండలేక, పార్టీకి, పదవికి న్యాయం చేయలేకపోతానని, ఆ స్థానంలో నేను సూచించిన వారికి గాని, పార్టీకి న్యాయం చేసే వ్యక్తికి గాని నియమించాలని సూచించారు.

శాకంబరీ అవతారం..

- మండపాల వద్ద అన్నదానం

నవతెలంగాణ-విలేకరుల బృందం


లింగంపేట్ : శాకంబరీ అవతారంలో దుర్గాదేవి

లింగంపేట్ : దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శాకంబరీ అవతారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. దుర్గామాత మాల ధరించిన భక్తులు అమ్మవారి మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పెద్ద ఎత్తున ప్రజలు అన్నదానంలో పాల్గొన్నారు. అలాగే మండలంలోని మెంగారం గ్రామంలో మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

దుర్గామాత మండపాల్లో కుంకుమ పూజ..
బీబీపేట్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని జనగామ గ్రామంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా శనివారం రాత్రి జనగామ గ్రామంలో కుంకుమ పూజ నిర్వహించారు. ఆదివారం త్రిశక్తి యూత్ ఆధ్వర్యంలో 9వ వార్షికోత్సవం సందర్భంగా కుంకుమ పూజ నిర్వహించారు. జనగామ గ్రామంలో దుర్గ భవాని మాలదరణ స్వాములకు మధ్యాహ్నం అన్నపానములు సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో అందించారు. అత్యంత భారీ నిర్మాణంలో సుమారు రెండు లక్షల పైచిలుకు రూపాయలతో 18వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ కప్పెర రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, యూత్ నాయకులు రేగుల సంతోష్ తదితరులు తెలిపారు.


మద్నూర్ : అన్నదానంలో పాల్గొన్న పలువురు

మద్నూర్ : మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద కాలనీవాసులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టారు.

ఘన్‌పూర్‌లో అన్నదానం..
వర్ని(చందూర్) : చందూర్ మండలంలోని ఘన్‌పూర్ గ్రామ దుర్గమ్మ దేవి మాత వద్ద భక్తులకు జంబీ వసంతలక్ష్మి, శ్రీనివాస్ గౌడ్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రోడ్డు బాగైంది.. స్పీడ్ పెరిగింది

స్పీడ్ బ్రేకర్లు నిర్మించండి.. అధికారులను కోరుతున్న మండల ప్రజలు



పాతబస్టాండ్ చౌరస్తా ప్రాంతంలో వాహనాల రద్దీ

నవతెలంగాణ-మద్నూర్
మండల కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తా ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు అత్యవసరమని జనాలు అంటున్నారు. ఈ ప్రాంతంలో ముందుగా రోడ్డు బాగులేక వాహనదారులు స్పీడ్‌గా రాలేకపోయేవారు. ప్రస్తుతం జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సహకారంతో అధ్వాన్న పరిస్థితుల్లో ఉన్న రోడ్డును బాగు చేయించడంతో వాహనదారులు తమ స్పీడు ఆపలేకపోతున్నారు. కాగా ఆదివారం ఉదయం ఇద్దరూ టు వీలర్ వాహనదారులు పెద్దప్రమాదం నుంచి బయట పడవలసి వచ్చింది. మద్నూర్ పాత బస్టాండ్ చౌరస్తా ప్రాంతంలో ఎక్కడి నుంచి ఎవరు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. మద్నూర్ పాత బస్టాండ్‌లో కిక్కిరిసి జనాలుంటారు. ఇక్కడే ఆటోలు నిలిపి ఉంచుతారు. ఎక్కడి నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని ఈ క్రమంలో ప్రమాదాలకు ఆస్కారం ఉన్నందున మద్నూర్ పాత బస్టాండ్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు వేయించాలని జనాలు కోరుతున్నారు.

ఆ ముగ్గురిపై చర్యలుండేనా..?

గత సర్పంచ్‌లు అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించిన ఎమ్మెల్యే

- వారిపై చర్యలు తీసుకుంటామని గతంలో వెల్లడి
- గెలిచి 9 నెలలు గడిచినా.. చర్యలేవి అని ప్రశ్నిస్తున్న ప్రజలు



నవతెలంగాణ-సదాశివనగర్
కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలో అక్రమాలకు పాల్పడ్డ ఆ ముగ్గురు సర్పంచ్‌లు ఎవరని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలున్నాయి. అయితే గత ప్రభుత్వ హయాంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముగ్గురు సర్పంచ్‌లు అక్రమాలకు పాల్పడ్డారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు. మండలంలోని మర్కల్ గ్రామంలో సన్మాన సభ కార్యక్రమంలో జనవరి, 28, 2024న ఎమ్మెల్యే మాట్లాడుతూ సదాశివనగర్ మండలంలో ముగ్గురు సర్పంచ్‌లు అక్రమాలకు పాల్పడ్డారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇప్పటి వరకు అక్రమాలకు పాల్పడ్డవారిని సర్పంచ్‌లను బయట పెట్టలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.
బయటపెట్టేది ప్పుడోనని మండల ప్రజలు ప్రధాన కూడళ్ల, హెూటల్‌ల వద్ద చర్చించుకుంటున్నారు. అక్రమా లకు పాల్పడ్డ ఎమ్మెల్యే బయట పెట్టకపోవడానికి ఆంతర్యమేమిటని అంటున్నారు. సుమారుగా 9 నెలలు గడచినా బయట పెట్టకపోవటానికి కారణాలేమిటనే ప్రశ్న మండల ప్రజల్లో వ్యక్తమవుతున్నది. అక్రమాలకు పాల్పడిన సర్పంచ్‌లను వెంటనే బయట పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం




మార్కెట్ కమిటీ చైర్మన్‌ను, డైరెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బీబీపేట్
మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజును, డైరెక్టర్ తోట రమేష్‌ను బీబీపేట్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నాయకులు, మాజీ ఎంపీటీసీలు చందుపట్ల విఠల్, చంద్రాగౌడ్, సొసైటీ డైరెక్టర్ గుట్ట మల్లేశం, మాజీ సర్పంచ్ వెంకటేశం, మాజీ రైతుబంధు మండల అధ్యక్షులు నాగరాజు గౌడ్, కాంగ్రెస్ యువ నాయకులు అరుణ్ శర్మ, నరేందర్, చంటిగౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీబీపేట్ మండలానికి చైర్మన్ పదవి ఇచ్చినందుకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మద్దిచంద్రకాంత్‌రెడ్డి

- ఎన్ఎస్‌యూఐ, గ్రామ అధ్యక్షుడి స్థాయి నుంచి కాంగ్రెస్‌లోనే..



నవతెలంగాణ-కామారెడ్డి
కాంగ్రెస్‌లో కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని, పదువులు సైతం వారికే వరిస్తాయని పీసీసీ చీఫ్ నుంచి మొదలు నియోజకవర్గ ఇన్‌చార్జిల వరకు చెప్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో పదవుల కేటాయింపులో సైతం అదే పంథా అనుసరిస్తున్నారు. తాజాగా కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా భిక్కనూర్‌కు చెందిన మద్దిచంద్రకాంత్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎదురుచూపులకు తెరపడినట్టయింది.
మద్ది చంద్రకాంత్ రెడ్డి చదువుకునే రోజుల్లో నుండి కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘమైన ఎన్ఎస్‌యుఐ నుంచి పార్టీ గ్రామ అధ్యక్షుడు నుండి మొదలుకొని కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా కొనసాగుతూ వచ్చారు. ప్రస్తుతం ఏఐసీసీ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ జోనల్ కోఆర్డినేటర్ గా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. మెదక్ జిల్లా సిద్దిపేట నియోజకవర్గానికి సభ్యత నమోదు ఇన్‌చార్జిగా సమర్థవంతంగా పనిచేసి భారీ ఎత్తున సభ్యత్వం చేయడంలో కీలక పాత్ర పోషించారని కార్యకర్తలు పేర్కొంటున్నారు. ఆయన సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నియామకం చేసింది.
జిల్లాలోని భిక్కనూర్ మండలం రామేశ్వరం పల్లి గ్రామానికి చెందిన మద్ది సత్తెమ్మ రాజారెడ్డి కుమారుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి. ఆయనకు భార్య మద్ది శ్యామల, ఇద్దరు కుమారులు మధ్య రామకృష్ణారెడ్డి కోడలు తేజస్వి, సాయి కృష్ణారెడ్డి. ఇతని రాజకీయ గురువు మహమ్మద్ అలీ షబ్బీర్, కాంగ్రెస్ పార్టీలో 34 సంవత్సరాలుగా కొనసాగు తున్నారు. 1989-91, సంవత్సరంలో ఎన్ఎస్‌యూఐ గ్రామ అధ్యక్షులుగా, 1991-94 ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడుగా, 1994-2000 యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడుగా కొనసాగారు. 2000-2005 ఉమ్మడి నిజామాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా, టిడిపి ప్రభుత్వ సమయంలో బిక్కనూర్ జెడ్పీటిసిగా 2001లో పోటీ చేశారు. 2005-10 ఉమ్మడి నిజాంబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ గా, 2010-12 భిక్కనూర్ మండల అధ్యక్షులుగా, 2013-2018 రామేశ్వర్ పల్లి గ్రామ సర్పంచ్‌గా, 2019-24 రామేశ్వర్ పల్లి గ్రామ ఎంపీటీసీగా, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. బీ ఆర్ ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉద్యమాలు చేస్తే కేసులు, ఒత్తిడిలు పెట్టి సొంత బిజినెస్‌లపై దాడులు చేసినా, ప్రలోభాలకు గురి చేసినా షబ్బీర్‌అలీ వెంట నిలిచినట్టు కార్యకర్తలు పేర్కొంటున్నారు.
కాగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవి కోసం నిజాంసాగర్ మండలానికి చెందిన ప్రదీప్, కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐరేని సందీప్ కుమార్, చంద్రశేఖర్, ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన మరో ఇద్దరు ప్రయత్నం చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి నమ్మిన బంటుగా ఉన్న మద్ది చంద్రకాంత్ రెడ్డిని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవి వరించింది.

ప్రమాదకరంగా రోడ్లు.. ప్రమాదాలకు నిలయాలు


గుంతలమయంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని ప్రధాన రోడ్ల మధ్య భాగంలో గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారాయని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్ల మధ్య భాగంలో గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు వెంటనే స్పందించి మండలంలోని ప్రధాన రోడ్లపై ఏర్పడ్డ గుంతలకు ప్యాచింగ్ వర్క్ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అప్పుల బాధతో వ్యవసాయ కూలీ ఆత్మహత్య

నవతెలంగాణ-వర్ని(మోస్రా)
చేసిన అప్పులు తీర్చలేక.. తిరిగి కొత్త అప్పు పుట్టదనే మనస్థాపం చెంది వ్యవసాయ కూలీ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోస్రా గ్రామంలో ఆదివారం చోటు చేసుకోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగం సాయిలు (46) అనే వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక, ఇంట్లో పెండ్లీడుకొచ్చిన కూతురు ఉండటంతో పెళ్లికి కొత్త అప్పు ఎవరూ ఇవ్వరని బాధతో గ్రామ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ముత్తవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శివం యూత్ ఆధ్వర్యంలో సన్మానం


చంద్రకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న యూత్ సభ్యులు

నవతెలంగాణ-భిక్కనూర్
మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన శివం యూత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డి గ్రంథాలయ చైర్మన్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ చంద్రకాంత్‌రెడ్డిని అభినందిస్తూ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివమ్ యూత్ సభ్యులు సంతోష్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

నవతెలంగాణ-లింగంపేట్
మండలంలోని ఐలాపూర్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద బాధితుడికి చెక్కును ఆదివారం అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రి పాలవడంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ చేతుల మీదుగా రూ.28,500 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, బైరయ్య, సంగయ్య, మదర్ పాషా తదితరులు పాల్గొన్నారు.